స్కెచ్

# "ఆనాటి నావోడు...."

"రాజా"

'ఏం ఆలోచిస్తున్నావు కల్యాణీ" అంటూ వచ్చి అతను వూహాలోకాల్లో గంతు లేస్తున్న కల్యాణి మనసును మానవలోకంలోకి త్రిప్పాడు. ఇంతవరకూ ఏదో ఆలోచిస్తున్న కల్యాణి హఠాత్తుగా అతని కంఠంవిని వులిక్కి పడింది. ఒక్కసారి అతని ముఖంలోకి పిచ్చిగా చూసి మళ్లీ ఎటోచూస్తూ వుండిపోయింది. ఆమె తలను ఇటు తిప్పుతూ "నాతో చెప్పవూ, ఏమిటా ఆలోచనలు మీ అమ్మ, నాన్న గురించేనా?" ఎందుకో కల్యాణి ముఖంలో విషాదచ్ఛాయలు కన్పించాయి. కళ్ళలో నీరు మిలమిలా మెరవడం కూడా అతను చూచాడు.

"చెప్పు కల్యాణీ దేనికి అల్లావున్నావు? ఇవ్వాళ ఇంత వరకూ ఎన్నడూలేనిది ఇవాళ ఏమైంది? నేనేమన్నా చేశానా?" చిన్నపిల్లను లాలించి నట్లు అడిగాడు. ఇప్పటికి కల్యాణి నోరువిప్పింది. పెదిమలు వణుకుతున్నాయి.

"లేదు శేఖర్, నువ్వేం చెయ్యలేదు. నువ్వు చేసిన తప్పల్లా నన్ను ఇంతగా ప్రేమించడమే నేమో! ఇవ్వాళ అల్లా ఆలోచిస్తూ కూర్చుంటే ఎందుకో నిజంగానే అమ్మా, గోపీ జ్ఞాపకం వచ్చారు" ఆమెముఖంలో విషాదచ్ఛాయలుపోలేదు.

"ఛా అందుకని అల్లా అయిపోతారా! ఇంక ఇప్పుడే ఇల్లా అయితే ఇక జీవితాంతం ఎల్లా వుండగలం మనం ఇక్కడ."

"శేఖర్, మనం నిజంగా పొరపాటు చేశామేమో."

ఒక్కసారి పక్కున నవ్వాడు శేఖర్. "లే, కాస్సేపు అల్లాతిరిగివద్దాం తగ్గుతుందేమోనీ బాధ."

కల్యాణి రామారావుగారమ్మాయి. వాళ్ళకి ఆమెకాక చిన్న పిల్లాడు మాత్రం వున్నాడు అంతే. ఆస్థికూడా అంత లక్షాధికార్లు కాకపోయినా ఏమీ తక్కువలేదు. కల్యాణి పదవ ఏట మేనరికం కాబట్టి సుందరానికిచ్చి పెళ్ళిచేసారు. కాని తర్వాత అతను చదువుసంధ్యలు లేకుండా దిక్కు కాయలా తిరగడం మొదలు పెట్టాడు. ఇంట్లోంచి కూడా వెళ్ళిపోయాడు. దాంతో మాటామాట మీద ఇక పిల్లను వీళ్లు పంపలేదు. వాళ్ళు పంపమన లేదు. నిజానికి ఇక ఎందుకు పంపుతారు. అంతే కాకుండా అప్పటినుంచీ ఆపకుండా కల్యాణికి చదువు చెప్పించారు.

ఆ చదువే ఇలాచేసిందేమో. కల్యాణి ఇంటర్ చదువుతున్నప్పటినుంచీ శేఖర్ క్లాస్‌మేట్. క్లాసందరిలోకీ తెలివైనవాడు. అతను ఎప్పుడూ కల్యాణిని పలకరించాలని చూస్తూ వుండేవాడు. కాని ఆమెమాత్రం ముభావంగా వెళ్ళిపోయేది. సంప్రదాయకుటుంబంలో పుట్టినపిల్ల అంత త్వరగా వశమవుతుందా మరి. చివరకు ఎలాగైతేనేం నాలుగేళ్ళకు శేఖర్ గెలిచాడు.

అది కల్యాణితప్పు కాదేమో. ఎన్నోసార్లు తను చేస్తున్నపని తప్పేమో అని తరచి చూసుకునేది. కాని శేఖర్ జ్ఞాపకం రావడంతో అన్నీ మరచేది. తను మొహమన్నా సరిగా చూడని భర్త కోసం ఎదురుచూస్తూ ఎన్నాళ్ళు వుండగలదు? ఆమెకుమాత్రం అందరిలాగా చట్టపట్టాలేసుకుని భర్తతో హాయిగా షికార్లు కొట్టాలని వుండదూ. మేడమీద కూర్చుని వాకిట్లోకి చూస్తూవుంటే ఎదురింటి జంట సాయంకాల మయ్యేటప్పటికి బయల్దేరుతుంటే తనకా అదృష్టం లేదేమో అని ఎన్నిసార్లు అనుకుందో. ఇలా మరో రెండేళ్లు గడిచాయి. ఎం. ఏ. పరీక్షలకి ఇద్దరూ వెళ్ళారు. శేఖర్ ప్రోద్బలంవల్ల ఆరోజే ఇద్దరూ ప్రయాణమై ఇక్కడకు వచ్చేశారు. ఇదీ కథ—

"శేఖర్, మనం ఇలా రావడం తప్పేమో!" దార్లో అడిగింది కల్యాణి. "నీకేం పిచ్చిగాని ఎక్కలేదుగదా! ఎందుకలా అనుకుంటావు, తప్పేమిటి రైటేమిటి? కొంతమందికి ఒకటి రైటయితే కొంతమందికి ఇంకోటి. ఈ తప్పులున్నాయి అన్న

వాళ్ళు ఎవరు? మనుషులుగాదూ. అప్పటికి వాళ్లు చేస్తున్న పని రైటన్నారు. అయితే కాలంతోబాటు అవిమాత్రం మారవూ...?"

"నువ్వు మాటైతే అన్నావుగానీ..."

"ఇంక వూరుకో కల్యాణీ. రేపు బయల్దేరి మీ వూరు వెళ్ళివద్దాం. నీ బెంగన్నా తీరుతుంది."

"కాని అక్కడ అందరూ ఏమనుకుంటారు చెప్పు, ముందరే ఆలోచించాల్సింది మనం."

"నేనన్నీ ఆలోచించాను. మనం ఒకళ్ళకు ఎందుకు భయపడాలి. రేపెడదాం...ఏం?"

* * *

"అమ్మా, అక్కవచ్చిందే!" లోపలకు పరుగెత్తాడు గోపీ.

బయటికివచ్చిన తల్లి ఒక్కసారి కావలించుకుంది కూతుర్ని. "మా తల్లే, వచ్చావమ్మా! ఎక్కడికెళ్లేవే నా తల్లీ? ఎదురుచూసీచూసీ కళ్లు కాయలుకాచిపోయాయి."

"బాగానేవున్నాగా! ఎందుకంత ఇదవుతావు? లోపలకు రా శేఖర్." శేఖర్ లోపలకు వచ్చాడు.

"ఎవరబ్బాయివి నాయనా నువ్వు?"

"ప్రస్తుతం శేఖరాన్ని లెండి."

"ప్రస్తుతం అంటావేమిటి శేఖర్. అది కాదమ్మా. వాళ్లవాళ్లు ఎవరూ లేరుట. తనొక్కడేట. స్నేహితులదగ్గర వుండి ఈ వూళ్లోనే చదువుకున్నారు. అలా చెప్పలేవూ?"

"మీవాళ్ళది ఏ వూరు నాయనా. నినెక్కడో చూసినట్లున్నాలే అందుకని. మా చుట్టాలబ్బాయివే అయితే మరీ మంచిది. మళ్ళీ ఆ సుందరంగాడు వస్తాడా...చస్తా..."

"అమ్మా నువ్వు లోపలకు వెళ్ళి భోజనం విషయం అదీ చూస్తావా కాస్త."

"సుందరం, ఎవరు కల్యాణీ?"

"అదే మా మేనత్త కొడుకు అని చెప్పానే. అతని పేరులెండి. అరె, ఎందుకలా చూస్తున్నారు. అదేమిటండీ" శేఖర్ తెల్లబోయాడు.

"మన అమ్మాయికి ఫస్టుక్లాస్ వచ్చిందేవ్... ఆఁ ఇదేమిటి ఎప్పుడొచ్చావమ్మా నువ్వు మాతో చెపితే కాదంటామా. నా సంగతి తెలియదుతల్లీ."

"క్షమించు నాన్నా. నువ్వు క్షమిస్తావని నాకు తెలుసు. కాని నా మనసే ఒప్పలా నాన్నా ఏదీ పేపర్ ఇలాతే శేఖర్ నీకు ప్రెసిడెన్సీ ఫస్టు."

"శేఖర్ ఎవరమ్మా" లోపలకు వస్తున్న తండ్రి గుమ్మంలోనే ఆగిపోయాడు.

"ఆ సుందరం నువ్వెప్పుడొచ్చావురా? ఎంతసేపయిందీ. ఇప్పుడెలా. అసలు సంగతంతా నీకెలా చెప్పడం, ఇన్నిరోజులూ ఏమయ్యావురా?"

కల్యాణి తెల్లబోయింది. "గాబరాపడకు ఇక్కడ మునిగిపోయింది ఏమీలేదు. నువ్వు భయ మామయ్యా. పడక్కర్లేదు. చిన్నప్పుడు రణదిప్ప కాయలాతిరిగి నాన్న వెళ్ళగొట్టితే ఈ వూరొచ్చి చదువుకుని శేఖరైనాను. ఇదీ భేదం. ఆశ్చర్యబోయింది కల్యాణి.

"ఏమిట్రా. అల్లా నిలబడ్డారేమిటి? సుందరం తెలుసా నాయనా నీకు ఎక్కడున్నాడు?"

"ఇక్కడే వున్నాడండి అత్తయ్యా. నేనే ఆ సుందరాన్ని. ఇందాక మీరు అన్నప్పుడే గ్రహించా ఇంతలో మామయ్య వచ్చాడు."

చాటంత ముఖమైందావిడకు, "ఆ. ఇందాకే అనలానేనూ ఎక్కడో చూశానని" అదే ఆ సంతోషంలో కాఫీగ్లాసు మర్చిపోయి కూతురుకిచ్చింది. కల్యాణి శేఖర్‌కిస్తూ "మరినాతోనన్నా చెప్పావు కాదేం శేఖర్ ఇన్ని ఏళ్ళనుంచీ."

"మరి నాకుమాత్రం ఏంతెలుసూ, నీ మేనత్త కొడుకుపేరు సుందరం అని నువ్వు మాత్రం చెప్పావా? నిన్ను గుర్తుకూడా పట్టాలా నేను మరి ఏంచేస్తాం?"

"పోన్లేకాని, అసలు అంతా చెప్పునాయనా నువ్వీవూరు ఎల్లా వచ్చావో అదీ..."

"ఏం లేదత్తయ్యా. అక్కడ్నించి ఈ వూళ్ళో ఫ్రండుదగ్గరుంటున్నా అంతే, వాళ్ళకి బాగావుందిలే. వాళ్ళనాన్న నన్నుకూడా కొడుకులానే చూశాడు ఇంతే."

"బలేతమాషా కాలం నాయినా కాలం. కలికాలం" లోపలకు దారితీసింది తల్లి.

"గొప్పపని చేశావుకాని స్నానానికి నడు బావా" పెట్టిలోంచి బట్టలు తీస్తూ అంది కల్యాణి

"గొప్పపని చేసింది. నువ్వా నేనా మరదలా" కుర్చీలోంచి లేచాడు శేఖర్. కాదు సుందరం.

"ఆ నాటి నా వోడు..." ఈలవేస్తూ ఆడుకోడానికి వెళ్ళాడు గోపీ.

★